క్లుప్తంగా

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం, పలు శుభకార్యాలు ఉండటంతో అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. భక్తులు అమ్మవారికి పాలు, పొంగళ్లతో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలి రావడంతో గ్రామంలో ట్రాఫిక్ అవరోధాలు లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

15 నుంచి బహుజన సేవా సమితి వారోత్సవాలు

నందిగామ: బహుజన సేవా సమితి నియోజక వర్గ స్థాయి సమావేశం ఆదివారం పట్టణంలోని చందమామ పేటలో జరిగింది. పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా మార్చి 15 నుంచి ఏప్రిల్ 14వ తేదీ వరకు బహుజన వారోత్సవాలు నిర్వహించేందుకు తీర్మానించారు. సమావేశంలో సేవా సమితి నాయకులు రవీంద్ర, రాజశేఖర్, తంబిరాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సొసైటీ భవన ప్రారంభోత్సవం



వత్సవాయి: రూ.90 లక్షలతో నిర్మించిన సొసైటీ భవనాన్ని రాష్ట్ర హోంశాఖా మంత్రి తానేటి వనిత సోమవారం ప్రారంభించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు రంగిశెట్టి ముత్తయ్య ఆదివారం తెలిపారు. గతంలో ఉన్న భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో దాని స్థానంలో నూతన భవనాన్ని నిర్మాణం చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా వెంటనే ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను చొరవతో నాబార్డు నిధులు రూ.25 లక్షలు, కాగా మిగతావి సొసైటీ నిధులు మొత్తం రూ.90 లక్షలతో భవన నిర్మాణాన్ని చేపట్టారు. అత్యాధునిక హంగులతో రైతులకు సౌకర్యవంతంగా ఉండేటట్లు నిర్మాణం చేయడం జరిగిందని అధ్యక్షుడు తెలిపారు.

క్వారీ కార్మికులకు భద్రత కల్పించాలి

కంచికచర్ల: క్వారీల్లో పనిచేసే కార్మికులకు భద్రత కల్పించాలని, పనికి తగ్గ వేతనం ఇవ్వాలని బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియర్ జిల్లా అధ్యక్షుడు జి. హరికృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. పరిటాల శివారు దొనబండ క్వారీ కార్మికులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ రంగ కార్మికులు ప్రమాదానికి గురైతే సంక్షేమ బోర్డు నుంచి సంక్షేమ పథకాలు అమలు చేయాలని, క్వారీలలో ఇతర ప్రాంతాల నుంచి వలసలు వచ్చి ఈ ప్రాంతంలో పనిచేస్తున్నారని, వారికి భద్రత కల్పించాలని కోరారు. అనంతరం పరిటాలలో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షురాలిగా పులి స్వాతి, కార్యదర్శిగా పులి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పుల కుమార్, పిల్లా శివశంకర్ క్వారీ కార్మికులు, భవన నిర్మాణ రంగ కార్మికులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

కంచికచర్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని తహసీల్దార్ వడ్డే శ్వరపు రాజకుమారి ఆదివారం తెలిపారు. ప్రజా సమస్యలపై అధికారులు అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు.

అన్నదానానికి రూ.70 వేల విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం ప్రకాశం జిల్లా, అద్దంకి మండలం, గోవాడ గ్రామానికి చెందిన మాకినేని అంజయ్య కుమారుడు బ్రహ్మయ్య రూ.70 వేలు ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవ రావు చేతుల మీదుగా అందజేశారు. అలాగే హైదరాబాద్ అమీర్‌పేటకు చెందిన పి.కాశీవిశ్వనాథం దంపతులు నిత్యాన్నదాన పథకానికి రూ.6 వేలు, గోశాలలో గోవుల సంరక్షణకు రూ.6 వేలు, హైదరాబాద్ మూసాపేటకు చెందిన గట్టు రవికుమార్, భార్గవి దంపతులు నిత్యాన్నదాన పథకానికి రూ.5 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

మునేటి తీరం.. ఆకుకూరల సాగుకు కేంద్రం

- వేసవిలోనూ ఆదాయం
- చౌకగా లభించడంతో పాటు ఆరోగ్యాన్నిస్తున్న ఆకుకూరలు



మునేటి తీరాన సాగవుతున్న ఆకుకూరలు

పెనుగంచిప్రోలు: ఆకుకూరల సాగుకు మునేటి తీరం కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలను ఆనుకుని ఉన్న ఇసుక నేలల్లో సన్న, చిన్నకారు రైతులు ఆకుకూరలు సాగు చేస్తూ ఆనందంగా జీవిస్తున్నారు. జనవరిలో వరి కోతలు కోసిన తరువాత ఆకుకూరలు సాగు చేపట్టి వేసవిలో జూన్ వరకు ఆరు నెలల పాటు అదను కాని రోజుల్లో కూడా రోజువారీ సంపాదనపై దృష్టి పెడుతున్నారు. మునేటి పరివాహక ప్రాంతంలోని పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లోని పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు, ముచ్చింతాల, ఆళ్లూరుపాడు, కొత్తవేమవరం, లింగాల, కంభంపాడు గ్రామాలకు చెందిన రైతులు చిన్నచిన్న కమతాల్లో ఆకుకూరలు సుమారుగా 100 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. 10 మంది రైతులు కలిసి రెండు లేదా మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని, కమతాలుగా విభజించుకుని వివిధ రకాల ఆకుకూరలు సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో పండించే ఆకుకూరల్లో ముఖ్యంగా తోటకూర, బచ్చలకూర, పాలకూర, చుక్కకూర, గోంగూర, కొత్తిమీర, పొదీన, కరివేపాకు ఉన్నాయి. సాయంత్రం పూట కోసిన ఆకుకూరలను రైతులు తమ సైకిళ్లపై, మహిళలు తట్టలతో గ్రామాల్లో విక్రయిస్తున్నారు. కొందరు రైతులు దగ్గరలోని నందిగామ, జగ్గయ్యపేట, కోదాడ రైతు బజార్‌లో ఆకుకూరలను విక్రయించుకుని సొమ్ము చేసుకుంటున్నారు. తాజాదనం కోరుకునే వారు నేరుగా వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి ఆకుకూరలు తెచ్చుకుంటున్నారు. ఆకుకూర కట్ట రూ.5 వరకు విక్రయిస్తున్నారు. ప్రస్తుత పెళ్లిళ్ల సీజన్‌లో ఆకుకూరలకు బాగా డిమాండ్ ఉంది. కూరగాయల ధరలు ఆకాశాన్నంటిన ఈ రోజుల్లో చౌకగా లభించడంతో ఆకుకూరలు వినియోగదారుల మెనూగా మారాయి.



ఆకుకూరలు కోసి కట్టలు కడుతున్న రైతు

ఆకుకూరలు.. ఆరోగ్యదాయకం

చౌకగా ఆకుకూరలు లభించడమే కాకుండా తాజాగా ఉండటంతో ప్రజలకు మంచి ఆరోగ్యాన్ని ఇస్తున్నాయి. ఆకుకూరల్లో కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, పీచు పదార్థాలు పుష్కలంగా ఉండటం వలన రోగ నిరోధక శక్తిని ఇస్తాయని వైద్యులు సలహా ఇస్తున్నారు. తేలికగా జీర్ణమయ్యే ఆకుకూరలు వేసవిలో తినడం ఎంతో మంచిదని చెబుతున్నారు.

ఆరు నెలలు సాగు చేస్తాం



వరి కోతలు కోసి మళ్లీ నాట్లు వేసేంత వరకు ఖాళీగా ఉండకుండా ఆకుకూరలు సాగు చేస్తున్నాం. ఐదారుగురం రైతులు కలిసి ఎకరం రూ.16 వేలకు పొలం కౌలుకు తీసుకొని సాగు చేపట్టాం. రోజుకు రూ.500 వరకు ఆకుకూరల అమ్మకం వలన ఆదాయం వస్తుంది. ఏళ్ల తరబడి ఇదే సాగును చేస్తున్నాం.

– ఏసురత్నం, రైతు, ముచ్చింతాల

డిమాండ్ బాగానే ఉంది



పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఆకుకూరలకు డిమాండ్ బాగానే ఉంటుంది. కుటుంబం అంతా కలిసి హాయిగా పనులు చేసుకుంటాం. రైతుబజార్లకు, స్థానికంగా ఉన్న కూరగాయల దుకాణాల్లో ఆకుకూరలు విక్రయిస్తాం. సాగులో మెలకువలు, ఎలా సాగు చేయాలో ఉద్యానవన శాఖాధికారులు తెలియజేస్తే బాగుంటుంది.

– దాస్, రైతు

ఆ కర్మాగారాలకు మద్దతు లేదు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను



కాలుష్య నియంత్రణ మండలి ఉత్తర్వులను చూపుతున్న విప్ ఉదయభాను

జగ్గయ్యపేట: నియోజకవర్గంలో ప్రజారోగ్యానికి హాని కలిగించే కర్మాగారాలకు నాది కానీ ప్రభుత్వ మద్దతు కానీ ఉండదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో ఆదివారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని షేర్‌మహ్మద్ పేటలోని గ్రీన్‌టెక్ కర్మాగారం వల్ల ప్రజలు, విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఆరు నెలల క్రితమే పరిశ్రమను మూసేందుకు కలెక్టర్ ఆదేశాలిచ్చారని తెలిపారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నివేదిక ఇచ్చారన్నారు. కానీ కర్మాగారాలను అప్పటికప్పుడు తొలగించడం సాధ్యం కాదని, కర్మాగారాలను తొలగించేందుకు మూడు నుంచి ఆరు నెలల సమయం ఉంటుందన్నారు. ఆ సమయంలోగా యాజమాన్యం కర్మాగారాన్ని తొలగిస్తుందని, ఇప్పటికే అందుకు తగిన కార్యాచరణ జరుగుతుందని చెప్పారు. అయితే స్థానిక ప్రతిపక్ష నేతలు కర్మాగారానికి తనది, ప్రభుత్వ మద్దతు ఉందని విమర్శలు చేయటం వారి చేతకాని తనానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం పరిశ్రమలను ప్రోత్సహిస్తూ ఉపాది అవకాశాలను కల్పిస్తుంది తప్ప ప్రజలకు హానీ కలిగించే కర్మాగారాలను ప్రోత్సహించదని తెలిపారు. జనవరి నాలుగున కర్మాగారాన్ని మూసేయాలని కాలుష్య నియంత్రణ బోర్డు నుంచి ఉత్తర్వులు వచ్చాయని చెప్పారు. ప్రతిపక్ష టీడీపీ నాయకులు ధర్నాలు, ఆందోళనలు చేస్తామని స్థానిక సామాజిక మాధ్యమాలలో తనపై, ప్రభుత్వంపై విమర్శలు చేయటం బాధాకరమన్నారు. ఒక్క గ్రీన్‌టెక్ కర్మాగారం మాత్రమే కాదని ప్రజలకు హాని కలిగించే ఏ కర్మాగారాన్నైనా తొలగించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి తప్పుడు ఆరోపణలు చేయటం మానుకోవాలని సూచించారు. ముందుగా గ్రీన్‌టెక్ కర్మాగారం తొలగించాలని కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన దేశాల ప్రతులను ఆయన మీడియాకు చూపించారు. వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి పాల్గొన్నారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



కళాశాల అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

నందిగామ: పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి పట్టణంలోని కేవీఆర్ కళాశాల వేదికగా మారింది. కళాశాలలో 1993–96 సంవత్సరంలో డిగ్రీ (బీఏ) చదివిన విద్యార్థులు 26 సంవత్సరాల తరువాత ఒకే వేదికపై ఆదివారం కలిశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆ పాత మధురాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం అప్పటి ప్రిన్సిపాల్ కేజీ తిలక్ తోపాటు ప్రస్తుత అధ్యాపకులను పూర్వ విద్యార్థులు సన్మానించారు.

వ్యవసాయానికి ప్రాధాన్యం



బోరు పంపు పనుల ప్రారంభంలో పాల్గొన్న ఎంపీపీ గాంధీ, నాయకులు

తోటచర్ల(పెనుగంచిప్రోలు): వ్యవసాయానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీపీ మార్కపూడి గాంధీ తెలిపారు. ఆదివారం గ్రామంలో వైఎస్సార్ జలకళ పథకంలో భాగంగా మంజూరైన రైతుల పొలాల్లో బోరు పంపు ఏర్పాటు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు శ్రేయస్సే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ జలకళ ద్వారా బోర్లు వేయడంతో పాటు మోటార్లు కూడా ప్రభుత్వం అందిస్తోందన్నారు. మండలంలో పథకం కింద 162 మంజూరు కాగా, గ్రామానికి 14 బోర్లు మంజూరయ్యాయని తెలిపారు. రైతులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కునుగుంట్ల రాములమ్మ, సొసైటీ అధ్యక్షుడు కె శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు లోకేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సాంబశివరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి రామకోటి ఉత్సవాలు



నందిగామ పట్టణంలోని రామకోటి స్తూపం

నందిగామ: పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి వారి ఆలయంలో 70 వ రామకోటి ఉత్సవాలు సోమవారం ప్రారంభమవుతాయి. ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. 69 సంవత్సరాలుగా రాసిన రామకోటి పుస్తకాలను ఆలయ ప్రాంగణంలోని రామకోటి స్తూపంలో భద్రపరిచారు. ఆరు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా నిత్యం స్వామి వారికి విశేష పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

బాల్యం నుంచి మంచి నడవడిక ఉండాలి



ప్రవచనం చేస్తున్న బాల బ్రహ్మానంద స్వామీజీ

పెనుగంచిప్రోలు: బాల్యం నుంచి మంచి నడవడిక ఉండాలని నైమిషారణ్యం పీఠాధిపతి, హిందూ ధార్మిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బాల బ్రహ్మానంద సరస్వతి స్వామీజీ అన్నారు. గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారిని ఆదివారం స్వామీజీ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే అన్నారు. ప్రతి మనిషిలోనూ అజ్ఞానమనే చీకటి తొలగిపోతే అంతా మంచి జరుగుతుందన్నారు. తలవంచాల్సిన చోట తల వంచితే జీవితంలో అంతా బాగుంటుందన్నారు. బాల్యంలో మంచి నడవడిక ఉంటే జీవితం సుఖంగా ఉంటుందన్నారు. ప్రాణం ఉన్నంత కాలం పెద్దలకు, గురువులకు కృతజ్ఞతగా, గౌరవంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, సూపరింటెండెంట్ సునీత పాల్గొన్నారు.

సిలువగిరిలో ప్రత్యేక ప్రార్థనలు



ప్రసంగిస్తున్న దైవ సేవకులు

నందిగామ: ప్రభువును ప్రార్థించిన వారికి కష్టాలు దరిచేరవని సిలువ గిరి పుణ్యక్షేత్రం విచారణ గురువు ఎం. ఫిలోమెన్‌రాజు అన్నారు. సిలువ గిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలని, ఎదుటి వారికి సహాయ సహకారాలు అందిస్తూ సన్మార్గంలో నడవాలని క్రీస్తు బోధించారని చెప్పారు. క్రీస్తు మాల ధారులు నియమాలు పాటించాలన్నారు. నందిగామ పరిసర ప్రాంతాల విశ్వాసులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

వీరులపాడు: వీరులపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరుగుతుందని ఎంపీడీఓ అరుంధతీదేవి ఆదివారం తెలిపారు. ఎంపీపీ కోటేరు లక్ష్మీ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

ఇంటింటికీ కుళాయి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీలో ఇంటింటి కుళాయి ఏర్పాటుకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ దృఢ సంకల్పం సాకారమయ్యే దిశగా మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు చర్యలు చేపట్టారు. మార్చి 14వ తేదీ నాటికి డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) సిద్ధం చేసేందుకు టెండర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇప్పటికే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఇంటింటి కుళాయి పథకానికి రూ.57.93 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఎలివేషన్ స్టోరేజ్ రిజర్వాయర్, అంతర్గత పైప్‌లైన్ పనులు చేపట్టనున్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడమే పచ్చ మీడియా వ్యూహం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నడూ లేని విధంగా అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి అన్ని రాష్ట్రాలు ఏపీ వైపు చూస్తుండగా, మన రాష్ట్రంలో ఉన్న పచ్చ మీడియా మాత్రం అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకోవడమే వ్యూహంగా ముందుకు వెళుతోందని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, తదితర నేతలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఊర చెరువు అభివృద్ధి గురించి అవాస్తవాల ప్రచారంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ సంపాదన కోసం చెరువును అడ్డుపెట్టుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. రూ.5 కోట్లతో చెరువును అభివృద్ధి చేయాలనే ప్రణాళికాబద్ధంగా ముందుకు పోతున్నామన్నారు. చెరువు స్థలాన్ని ఆక్రమిస్తున్నారని, దాన్ని వ్యాపారానికి ఉపయోగిస్తారని కథనాలు రాయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చెరువు స్థలాన్ని మొత్తాన్ని వాకింగ్ ట్రాక్, గ్రీనరీ తదితర అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగించడమే జరుగుతుంది కానీ ఎటువంటి అక్రమాలకు పాల్పడాల్సిన అవసరం తమకు లేదన్నారు. ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నియోజవర్గ అభివృద్ధిలో భాగంగా రూ.14 కోట్లతో చిల్లకల్లు–జగ్గయ్యపేట ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణం, రూ.60 కోట్లతో ముక్త్యాల వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి, రూ.5 కోట్లతో ఊర చెరువు అభివృద్ధి, మున్సిపాలిటీ ద్వారా రూ.14 కోట్లతో వార్డుల్లో అభివృద్ధి, రూ.3 కోట్లతో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణం తదితర అభివృద్ధిని చూసి ఓర్వలేక పచ్చ మీడియా తరచూ తప్పుడు కథనాలు రాస్తూ ప్రజలు తప్పుదారి పట్టించాలని విశ్వప్రయత్నం చేస్తున్నాయని తెలిపారు. ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు.

పేటను పర్యాటక కేంద్రంగా రూపొందించేకు ఎమ్మెల్యే ఉదయభాను సంకల్పించారని తెలిపారు. జిల్లాలోనే పేటను పర్యాటక కేంద్రంగా భావితరాలకు అందించాలనే సదుద్దేశంతో చెరువు సుందరీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికైనా తప్పుడు రాతలు మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. పరువునష్టం దావా వేయడానికి కూడా వెనుకడుగు వేసే ప్రసక్తి లేదన్నారు. నాయకులు ఫిరోజ్‌ఖాన్, తన్నీరు నాగేంద్ర పాల్గొన్నారు.

3న కొబ్బరి చిప్పల సేకరణ హక్కు వేలం

విస్సన్నపేట: పుట్రేలలో మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో కొబ్బరి చిప్పలు, వస్త్రాల వేలం మార్చి 3న నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోటగిరి సునీల్‌కుమార్, ఈఓ సీతారామ్య ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం ప్రారంభమవుతుంది. హక్కుదారులు సంవత్సర కాలంపాటు కొబ్బరి చిప్పలను పోగుచేసుకోవచ్చని తెలిపారు. లడ్డూ ప్రసాదం తయారు చేసి ఇచ్చే హక్కునకు (బ్రాహ్మణవంటవారు) బహిరంగ వేలం కూడా నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

మొక్కజొన్న పంట పరిశీలన



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

ముసునూరు: యువ రైతు ఆత్మహత్యాయత్నానికి దారి తీసిన మొక్కజొన్న పంటను మండల వ్యవసాయాధికారి చేబత్తిన శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. నూజివీడు మండలం పోలసానపల్లికి చెందిన యువ రైతు వేముల వెంకటరావు మండలంలోని ముసునూరులో మరీదు హరిబాబుకు చెందిన 6.34 ఎకరాల విస్తీర్ణంలో సీపీ 31–ఎ విత్తన మొక్కజొన్నను సాగు చేశాడు. పంట ఆశాజనకంగా లేకపోగా, మొక్కజొన్న పొత్తుకు విత్తనాలు కూడా సరిగా పట్టకపోవడంతో నష్టపోతున్నాననే దిగులుతో శనివారం ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో వెంకటరావు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను వ్యవసాయాధికారి పరిశీలించి, విత్తన కంపెనీ ప్రతినిధులు, సమీప రైతుల నుంచి వివరాలు సేకరించారు. దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు ఆయన తెలిపారు.

వాహన చోదకులకు జరిమానా

కంచికచర్ల: వాహన చోదకులు విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, సంబంధిత పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ఎస్ఐ పెంకె సత్య వెంకట సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక పెట్రోల్ బంక్ సెంటర్, కంచలమ్మ చెరువుకట్ట సెంటర్‌లో ఆదివారం వాహనాలు తనిఖీలు చేశారు. వాహనాలకు సంబంధించి ఎటువంటి పత్రాలు లేని వాహన చోదకులు 25 మందికి రూ. రెండు వేల జరిమానా విధించారు. ఎస్ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. అతివేగంగా వాహనాలు నడపరాదని, జాతీయ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని చెప్పారు. వాహనాలను చిన్న పిల్లలకు ఇవ్వరాదన్నారు. ఆటోవాలాలు లౌడ్ స్పీకర్లు తొలగించాలని, లేకుంటే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నిబంధనలు పాటించాలి..

పెద్దాపురం(వీరులపాడు): వాహన చోదకులు నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సోమేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని పెద్దాపురం గ్రామ సమీపంలో ఆదివారం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వాహన చోదకులు విధిగా వాహనాలకు సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. ఆటోవాలాలు పరిమితికి ప్రయాణికులను ఎక్కించరాదని చెప్పారు. రికార్డులు సక్రమంగా లేకుండా తిరుగుతున్న పలు వాహనాలను గుర్తించి జరిమానా విధించారు.

కారు బోల్తా పడి నలుగురికి గాయాలు



ధ్వంసమైన కారు

గౌరవరం(జగ్గయ్యపేట): అదుపు తప్పి కారు బోల్తా పడిన ఘటన గౌరవరం గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. వివరాల్లోకి వెళితే తూర్పు గోదావరి జిల్లా రాజోలు సమీపంలోని మల్కిపురం గ్రామానికి చెందిన ప్రదీప్‌కుమార్, గుండె రవి, నల్లా సన్ని, కోన నిస్సీలు హైదరాబాద్ మల్కిపురానికి కారులో బయలుదేరారు. తెల్లవారుజాము సమయంలో గ్రామంలోని ఎన్ఎస్పీ కెనాల్ వద్దకు వచ్చే సరికి ఒక్కసారిగా కారు రోడ్డు పక్కగా పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులోని వారికి తీవ్ర గాయాలయ్యాయి. హైవే మొబైల్ సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని క్షతగాత్రులను నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కారు నుజ్జైనప్పటికీ ప్రదీప్‌కుమార్, కోనా నిస్సీలకు తీవ్ర గాయాలు కావడంతో మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనకు సంబంధించి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు కాలేదు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సామినేని వెంకట కృష్ణ ప్రసాద్

జగ్గయ్యపేట అర్బన్: క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువ జన నాయకుడు సామినేని వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. కోవిడ్ సమయంలో పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త రామిశెట్టి సాయి కోవిడ్‌తో మృతిచెందాడు. ఈ నెల 13 వ తేదీన అతని మిత్రులు రామ లక్ష్మణ్ ఆధ్వర్యంలో రామిశెట్టి సాయి సంగమేష్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను స్థానిక ఆర్టీసీ డిపో గ్రౌండ్‌లో ఏర్పాటుచేశారు. విజేతలకు ఆదివారం వెంకటకృష్ణ ప్రసాద్ బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కోవిడ్‌తో మృతి చెందిన స్నేహితుడి పేరు మీద ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రథమ విజేతగా సాయి సంగమేష్, ద్వితీయ విజేతగా కేఆర్. పోలీస్, తృతీయ విజేతగా బాబు జయంతి టీములు నిలిచాయి. వైఎస్సార్ సీపీ పట్టణ యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, టీమ్స్ స్టే అండర్ భాను సభ్యులు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి సహకరించాలి

తిరువూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సుశీలరావు కోరారు. ఆదివారం పూర్వవిద్యార్థుల సమావేశం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనతో పాటు ఆధునిక కోర్సుల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదించామని, యూజీసీ నిధులతో భవనాల నిర్మా ణం జరిపామన్నారు. పూర్వ విద్యార్థుల సహకారంతో కళాశాలను అభివృద్ధి చేస్తామని ప్రిన్సిపాల్ వివరించారు.